జరిగాయనుకున్నట్లు ఆనందిస్తూ మధురభక్తి సంప్రదాయంలో కొట్టుకుపోవడం మానరని, ఛాలెంజిచేసి చెప్తాను. అందుకే వంట లెక్చుయల్స్‌కి ఎంకిబాటిలూ ఇంకుపాటలూ అక్కర్లేదు. దే డోంట్ కేర్.

# కాగితపు పల్లకి

**ఖ**మ్మని పూరీలోయ్ బావా కరకర వేపానోయ్ బావా - అంటూ ఏ మరదలు పిల్లేనా మీది మీది కొస్తూంటే మీకెల్లా గుంటుందండీ అని అడిగా - అంటే మరదలు పిల్ల ఒరిజినల్ సెల్ఫ్‌ని టచ్ చేస్తుంది. పెళ్ళాం పర్సుని టచ్ చేస్తుంది అంతే తేడా అన్నారు. అహ్హా అల్లాగా - పెళ్ళాం చూపించని సైడుపోజులు మరదలు చూపెడ్తుంది అంటారనుకున్నా అన్నాన్నేను. సర్టెన్లీ... పెళ్ళాం అమృత వర్షిణి లాగుంటే మరదలు ఆనందభైరవి కాదా - క్కాదు. మరద లంటే మరగకాచిన పాలు, పెళ్ళాం తోడుకున్న పెరుగు.... దట్సాల్; మరి మరదల్ని మరగకాచిన పాలని ఎందుకన్నారు? మూతిమీసాలు కాల్తాయి గనుక. తెనాలి రామకృష్ణుడి పిల్లికి కాలినట్లు; చాల్లెండి వేళాకోళం.... పెరుగైతే ఎంచక్కా కంచంలో బోర్లించుకుని జుర్రేసుకోవచ్చు. పాపం...పెళ్ళాం మరగకాచిన పాలులా వుండదా... వుంటుందనుకో... అప్పుడు, వూదుకుని మూతిమీసాలు కాలకుండా ట్రయిచెయ్యాలి. అదంతా చాలా కష్టం... పెరుగైతేనే బావుంటుంది.

అందుకా "ఏ మే" అంటూ మేకలా అరుస్తారు. అవును, మేకులా వుంటే మేకలా అరకవ తప్పదు మరి. నో నో - పిలుపులోనే వలపుల్చిలకరించడం మీ మగాళ్ళు నేర్వాలిసార్; అసల్ సీక్రెట్ ఆ వలపుగుబులు గమ్మత్తంతా టోన్‌లోంచే రావాలి. అంతేగాని టముకేసినట్టు "ఇదిగో" "ఒసేయ్" "ఏమేవ్ - పీనుగూ - మొద్దూ" అంటూ ఆడదాన్ని కించపరుస్తూ హీనంగా పిలిస్తే ఈ రోజుల్లో అమ్మాయి లెవరూ వూరుకోరు. వెధవ అధార్టీ - బోడిగొప్పలూ టోన్‌లో పలికించడం. వలపు లొలకించడం కానేరదు.

మొగుణ్ని సింపుల్‌గా "ఏవండీ" అని పిలుస్తేచాలు (అందులో ప్రాణ నాయకా, ప్రాణేశ్వరా, నిజవల్లభా, మానసచిత్తచోరా, ప్రాణప్రియలాంటి సంబోధనలన్నీ వున్నట్లే) ఏవండోయ్ అంటే ఆ - "డోయ్"లోనూ ఏవండీ లోని "వండీ" లోనూ ఆ స్వీట్ టచెస్ అన్నీ వీణమీద వ్రేళ్ళు పలికించినట్లు గొంతుకలో పలికించగల ఆడది మీరు చెప్పినట్లు నిజంగా అమృతవర్షిణే. "గుత్తి వంకాయ కూరోయ్‌బావా" పాటలో మల్లే పిలుపులో వలపులుగుమ్మరించడం మన పడుచువాళ్ళు నేర్వాలి సార్; అంతేగాని "ఒసే" అంటే "ఒరే" అనుకునే సమానత్వం కానీ, "స్వర్ణమంజరీదేవి అంటే భుజంగరాడ్మహాశయా" అంటూ కోతి డైలాగులు వల్లించడం కాని,

డామ్ డర్టీగా వుంటుంది. అసలు ట్రబులు పైపై మెరుగులవల్లా ఏకవచన బహువచనాలు ప్రయోగించడంవల్లా తగ్గదు. మన మిడిల్ క్లాసుకి సరైన కల్చర్ లేదు. సినిమాలు చూసి వేషభాషలూ కట్టూబొట్టూ దిద్దుకోవడానికి మనం జంకడం లేదు. సిద్ధంగా వున్నాము. మన ఆలోచనల్నీ మన బ్రతుకుల్నీ నడిపిస్తున్నవి మేధావుల సూక్తులూ ప్రతిభావంతుల చేతలూకావు. అణాకానీ రచనలూ, పావలా పరక సినిమాలూనూ, ప్రేమట - రాస్కెల్సు ప్రేమంటే టెరికాటన్, టెరిలీన్, నైలాన్, షిఫాన్, కాశీపట్టూ - కంచి పట్టు అనుకుంటున్నారు. అది భగభగ చురచురమనిపించే నిప్పని తెలీక, ప్రేమ నిప్పని తెలిస్తే దాని జోలికెవరూ పోరు. రుక్జా అంటే ఆగిపోతారు.

ఆ రిక్షాలోంచి దిగుతున్నది "మీవారా" అనటానికి బదులు "నీ ప్రియుడా" అని అంటే ఏ ఇల్లాలయినా యీడ్చి లెంపకాయకొడుతుంది. కొట్టాలి... పెళ్ళయిన అమ్మాయిని "నీ మొగుడ్ని ప్రేమిస్తున్నావా సూరీడూ" అని అడిగి చూడండి. డామ్ ఇన్సల్ట్ ఫీలయి చూపుల్తోకాల్చి పారేస్తుంది. ఉత్తరం ఎక్కడుణ్ణుంచిరోయ్ - నీ ప్రేయసి రాసిందా - అని అడిగేస్నేహితుడికి మొహం చిట్లిస్తూ "కాదురా నా వైఫ్ రాసింది" అని కూల్‌గా జవాబిస్తాడు పెద్దమనిషైనమగాడు. పెద్దమనిషైన మగాడు పెద్దమనిషైన ఆడది ఒహలాటి వారనుకునేరు కొంపదీసి... మొత్తానికి తేలేదేవంటే ప్రేమ యాంటీశోషల్ వ్యవహారంగా, అసహజంగా మన సొసైటీలో ముద్రపడిపోయింది.

పెళ్ళి నాచురల్, ప్రేమ అన్నాచురల్ కనుక చెడిపోవాలనుకునే వాళ్ళు ప్రేమించడం, బాగుపడేవాళ్ళు పెళ్ళాడటం పెద్దలు ఉభయ వర్గాలమీదా అక్షింతలు జల్లడం జరుగుతోంది. సంప్రదాయమూ సంఘమూ గీచిన గిరుల్ని దాటిన వ్యక్తులు మోసగింపబడటము, ఆ వలయంలో యిరుక్కున్న మనుషులు సుఖపడ్డమూ చిత్రంగా జరుగుతూవుంటుంది. సొసైటీని పట్టించుగోకుండా జీవించదలచినవాళ్లు సోషల్ సెక్యూరిటీని కాదంటున్నారు తెలిసో తెలీకో... కాని మన కథల్రాసే వాళ్ళు నోవెల్సు బరికేవాళ్లూ సృష్టిస్తోన్న కన్‌ఫ్యూజన్ (గందరగోళం)ను మన మత ప్రసక్తిలేని రాజ్యాంగమూ, మనిషికి విలవలేని రాజకీయాలూ, ఘోరంగా దగాచేసి ముసుగేసికూర్చోపెట్టి ఫూల్సుని చేస్తున్నాయి. ఇవి పురుటినొప్పులనుకుంటే ఈ నొప్పుల్ని గడచి నవసమాజం, మన అవసరాలకుసరిపడే చైతన్యవంతమైన ఒక నూతనవ్యవస్థ వుద్భవిస్తుందా లేక మృతశిశువులాటి ప్రాణం లేని మూర్తిని ప్రసవిస్తే తెల్లబోవాల్సివస్తుందా?

బట్ టేకిట్ ఈజీ- అసలే లవ్వనేపదార్థం ఇంగ్లీషు చదువుల్తో మనకు దిగడినట్టు కనిపిస్తోందికాని అనాదినుంచి మనతాత ముత్తాతలనుంచి దిగడివస్తూన్న శాల్తీ కాదు. ఈ ప్రేమ అనుమాటగురించి నేను గాఢంగా పరిశోధించాను. నా రిసెర్చిలో నేను కనిపెట్టినదేమిటంటే, మనకు మోహము దయ, స్నేహము వున్నాయికాని స్త్రీ పురుషులమధ్య ప్రేమలేదు. వలపు అనేది వుంది. ఈ శబ్దాన్ని మన పురాణాల్లో ఎవరూ వాడలేదు. ప్రేమ అనేమాట ఎల్వోవియ్యీ లవ్ అనే శబ్దానికి ఆల్టర్నేటివ్‌గా తెలుగులో దూరింది ఈ శతాబ్దంలోనే.

బహుశా బైబిల్ లోంచి దీన్ని లాగారేమో అని తోస్తుంది. అఫ్‌కోర్స్ - చలంగారూ, కుటుంబరావుగారూ ముందస్తిగా ఈ మాటకు మంచిసర్క్యులేషన్ తమతమ రచనలద్వారా కలిగించారనుకోండి. వీరికి ముందే భావకవులు దీనికి ప్రాణంపోశారు. కనుక కాగితాలమీద కనపడినంతగా ప్రేమ లైఫ్‌లో కనపట్టంలేదని గాబరాపడితే లాభం లేదు. సంఘం రక్షించకపోతే దేవుడన్నా రక్షించడా పో అని ప్రేమ వివాహం చేసుకోదల్చుకున్నవాళ్ళు తిరుపతి వెళ్ళి పెళ్ళి చేసుకుంటున్నారు. తల్లితండ్రులు అత్తమావలు కూడా వాళ్లు ప్రేమవివాహం చేసుకున్నారు, వాళ్ళని పండక్కి పిలవక్కర్లేదు. బట్టలు పెట్టనక్కర్లేదు, వాళ్ళకు ప్రేమచాలు అనే ధోరణి నవలంబించి ఇచ్చిపుచ్చుకోటాలు పెట్టుపోతలవిషయంలో ప్రేమికులను దగాచేస్తున్నారు. ప్రేమలో నెగ్గిన వారిని ప్రేమే కొరుక్కుతినండి మరి వేరే ఆకలివుండదు గదా మీకు అని అమ్మలక్కాస్ దెప్పుతూంటారు.

మీ కోడలికి ఏం పెట్టారమ్మా పుట్టింటివారు. అంటే అయ్యో ఓ ముద్దూ ముచ్చటా - బొమ్మలా నడిచివచ్చిందమ్మా మాయింటికి అని హేళనపట్టిస్తూంటారు. పడుచువాళ్లు ప్రేమలో దూకడం అంటే కళ్లు మూసుగు నిప్పులగుండంలో దూకినట్లేనని మనవాళ్ళంతా భావిస్తూంటారు లోపల్లోపల. పైకి బావుందమ్మా - బావుంది- పెళ్ళిళ్లన్నీ యిల్లాగే జరగాలి శుభ్రంగా అంటూ వెనక వెడల్పాటి గోతులు తవ్వుతారు.

మరోటి ఈ సినిమావాళ్ళు ప్రతి ప్రేమవ్యవహారం, వివాహంకాని కడుపుతోవున్న అమ్మాయి కష్టాలతో, బ్రహ్మాండమైన బ్యాకు గ్రవుండు మ్యూజిక్కు పాటల్తో హడలకొట్టేసి చంపేస్తుంటారు. అందుకే అబ్బాయిలు అమ్మాయి కడుపుతోవుందనగానే పుంజీలు తెంపుకుని పారిపోవడానికి ఎత్తులు వేస్తుంటారు. ఈ మాత్తర్లో ఫామిలీప్లానింగుధర్మమా అని కొంతన్యూసెన్స్ తగ్గిందనుకోండి. ప్రేమించినపిల్ల నెలతప్పిందనగానే సినిమావాడు చేసే న్యూసెన్స్ యింతా అంతాకాదు. ఓ పాటలేనా. ఓ ఏడుపులేనా, ఓ గుద్దుకోడాలు కొట్టుకోడాలేనా, మగవారి మోసమంతా యమ క్రూడ్‌గా చిత్రించి, ఫామిలీ సెంటిమెంటుని పొగిడి, మగాడిమంచితనాన్ని తెగడి, తెర అంతా విలనీతో ఏడుపుతోనూ నింపేస్తారు. ఈ సినిమా ల్చూసి నవల్సు రాసే ఆడాళ్ళు ప్రతిపేజీలోనూ "ప్రేమే నేరమౌనా - మాపై యీ పగేలా. వేదనగానే మా వలపంతా వేసారునా" అని వాపోతారు.

కులాంతర, మతాంతర, దేశాంతర, లోకాంతర ప్రేమలు ఊహించుకోడానికి బాగానే వుంటాయిగాని, తెరమీద న్యూస్ ప్రింట్ మీదా బావున్నట్లు లైఫ్‌లో బావుండవు. ఆంధ్రా లేడీస్‌కి అంతర్జాతీయ ప్రేమమీద మరులున్నట్లు యిటీవల కొంతమంది రచయిత్రులు తమ నవలల్లో వాంతిచేసుకున్నారు. దారుణమైన కోర్కెల్ని మనసులో వుంచుకుని కాగితంమీద తీర్చుకునే సదుపాయం ఓటివుండడంవల్ల లేడీస్ ఆర్ మేకింగ్ ది బెస్టు యూజాఫిట్.

మగాళ్ళేం తక్కువతినలేదనుకోండి - కోరికలు తీర్చుకోవడానికి కొత్తదారులు వెతకడంలో ఘనాపాటీలు. కామ స్వేచ్ఛకోసం ఆడాళ్ళు మగాళ్ళతో పోటీపడతారనుకోండి. అప్పుడు స్వేచ్ఛా

ప్రణయానికి బ్లాంకు చెక్కు సొసైటీ యివ్వాలి. ఇస్తుందా - ఏవిటి మీ వెర్రి. ఇవ్వదు. ఇవ్వకపోతే కాగితంమీద ఆ సరదా తీర్చుకోవాలిసొస్తుంది. ఇలా కాగితాలమడతల్లో దాగిన కోర్కెలు సంఘంలో మార్పుకోసం గోతికాడ నక్కల్లా కాసుకు కూర్చుంటాయి. ఇంతకీ చెప్పొచ్చేదేవంటే, రక్తపాతం లేకుండా పొలిటికల్ ఫ్రీడం సంపాయించాం కాని. కల్చరల్ రివల్యూషన్ రాకుండా మన సొసైటీ మారదు. మన సొసైటీ మారకపోతే మనజాతికి మోక్షంలేదు. మైడియర్ సిస్టర్స్ అండ్ బ్రదర్స్; స్త్రీనిలాగితే డొంకంతా కదుల్తుంది. (తీగ అంటే లత; లత అంటే స్త్రీ. డొంక అనగా లోకము) స్త్రీల సమస్యగురించి ఆలోచించి చెయ్యాల్సింది స్త్రీలుకారు. ఏ గురజాడో వీరేశలింగమో రాజారామమోహనరాయో ప్రొఫెసర్ కార్వే వంటివారు. స్త్రీలు ముఖ్యంగా చేయవలసిన సహాయం ఒకటుంది. అది దారికడ్డంగా లేకుండా వుండటం....

# రాగమాలిక

మొన్న సైకిలుమీద లైటు లేకుండా వెళ్తే మావార్ని పోలీసు పట్టుకున్నాడ్ట. మా యింటిముందు లాంతరుస్తంభం వెలగడంలేదు. శాన్నాళ్లయి...దాన్ని వెళ్ళిపట్టుగోడేమి? చీకట్లో దీపంలేకుండా వెళ్లకూడదు. సరే... చీకట్లో దీపం లేకుండా జీవించవచ్చా? ముందు యింట్లో దీపం తిన్నగా వెలిగితే, సైకిలుమీద కూడా తిన్నగా వెలుగుతుందని చెప్పరేమి? గుళ్ళో దీపం పెడితే పుణ్యమూ. గుడిసెలో దీపం పెడితే పాపవునా? దీపాలవారి చిన్నదాన్ని కోపాలవారి చిన్నవాడికిచ్చి పెళ్ళి చేస్తారట. శుభలేఖ.. దీపాలవారంటే ఎలక్ట్రిసిటీవారూ, కోపాల వారంటే పోలీసువారూనూ. కోపాలవారు తమ కోర్కెలతో దీపాలవారిని ఆర్పేస్తారేమోనని నాకో చిన్న డవుటు.

దీపం లేదని పట్టుకున్న పోలీసు. పావలా పరకా పుచ్చుగుని తృప్తి పడకుండా. మావారిచేత గుంజీలుకూడా తీయించాడేమో ఖర్మ; ఈ మగాళ్లు అడ్డమైన అవమానాల్నీ హాండ్ కర్చీఫ్‌తో తుడిచేసుకుంటారు. మరి మన ఆడాళ్ళు చెంగుతో తుడిచేసుకున్నట్లు... అవదం దీపమైనా తిన్నగా వెలగాలంటే చవురుండాలి. వత్తిని ఎగసన తోయడాని కోపూచికపుల్ల లాటి దుండాలి. హరికేన్ లాంతరుకి చిమ్నీ బాగుండాలి. బర్నరు మంచిదై యుండాలి. విద్యుద్దీపానికి బల్బుండాలి. కరెంటుతోపాటు కనెక్షన్లన్నీ టీక్‌టాగ్గా వుండాలి. అప్పుడే మీట నొక్కితే దీపం వెలుగుతుంది. పెళ్ళామైనా అంతే, మొగుడైనా అంతే - అన్నీ సరిగ్గా వుంటేనే మొహంలో వెలుగు - లేకపోతే బ్రతుకంతా అయోమయవేఁ... బ్రతుకంతా చీకటే అయిపోతుందేమోనని, వెలుతురుకూడా మనుష్యులు సమంగా పంచుకోరే మోనని చందమామను తెచ్చి యిస్తే రష్యావారూ, అమెరికావారూ అద్దానికోసం కొట్టుకు చస్తున్నారు.